తప్పని ప్రాథమిక ఇబ్బందులు

- రెండేళ్లుగా జరగని ఫిరంగిపురం పీహెచ్‌సీ భవన నిర్మాణం
- వైద్యులున్నా వసతులు శూన్యం
- హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లోనే వైద్య సేవలు
- వ్యాక్సిన్లు, కాన్పులకు నుదురుపాడుకు తప్పని పరుగులు
- 9 గ్రామాల రోగుల తప్పని ఇక్కట్లు
- భవనమొస్తే.. సిబ్బంది పెరిగే అవకాశం


వైద్యశాల భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలం


హెల్త్ సెంటర్లో పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు

ఫిరంగిపురం: మండల కేంద్రమైన ఫిరంగిపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవనం లేక రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదు. రెండేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇక్కడ పీహెచ్‌సీని మంజూరు చేసింది. ఇద్దరు వైద్యులు, సీహెచ్‌వో, హెచ్‌వీ పోస్టులు కేటాయించింది. ప్రస్తుతం వైద్య సిబ్బంది స్థానిక హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లోనే వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ వైద్యశాల పరిధిలో తొమ్మిది గ్రామాల ప్రజలు చికిత్స కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నుదురుపాడుకు పరుగులు

మండలంలోని 18 గ్రామాల్లో సుమారు 62 వేల మంది జనాభా ఉన్నారు. వీరి ఆరోగ్యం కోసం 20 ఏళ్ల కిందట మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైంది. ఫిరంగిపురంలో స్థలం లేకపోవడంతో నుదురుపాడులో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సంకల్పించారు. జనాభా ప్రాతిపదికన నూతనంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఏర్పాటుకు అనుమతులిచ్చారు. దానిలో భాగంగా ఫిరంగిపురం కేంద్రంగా మరో పీహెచ్‌సీని కేటాయించారు.

స్థలముంది.. భవనం లేదు

పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం కోసం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో స్థలం కేటాయించారు. కానీ, ఏళ్లు గడుస్తున్నా నూతన భవనం నిర్మాణం ప్రారంభించలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం అందుబాటులోకి వస్తే.. యూడీసీ1, స్టాఫ్ నర్సులు ముగ్గురు, పీహెచ్‌ఎన్, ఎల్‌టీ, ఫార్మాసిస్ట్, పురుష ఎంపీహెచ్‌ఎస్, అటెండరును నియమించుకోవచ్చు.

వ్యాక్సిన్ తెచ్చేందుకు పాట్లు

పీహెచ్‌సీ పరిధిలోని ఫిరంగిపురంలోని మూడు హెల్త్ సెంటర్లతోపాటు శిరంగిపాలెం, 113తాళ్లూరు, తక్కెళ్లపాడు, వేములూరిపాడు, అమీనాబాద్, హౌస్ గణేష్, రేపూడి, గరుడాచలపాలెం, గొల్లపాలెం గ్రామాల్లో వ్యాక్సినేషన్‌కు ఆరోగ్య సిబ్బంది 8కిలోమీటర్ల దూరంలోని నుదురుపాడు పీహెచ్‌సీకి వెళ్లి వ్యాక్సిన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి. గర్భిణులకు ప్రసవం చేయాలన్నా నుదురుపాడు తీసుకెళ్లాల్సిందే. పేరుకే వైద్యశాల కానీ, వసతులు లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

రోగుల ఇక్కట్లు

పీహెచ్‌సీ కేటాయించారు కానీ, భవనం లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్లోనే వైద్యులు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతిరోజు 50 నుంచి 60 మంది వరకు రోగులు వస్తుండటంతో సరైన వసతులు లేక వారు ఇక్కట్లు పడుతున్నారు.

ప్రభుత్వం నూతన భవనం నిర్మించే వరకు అద్దె భవనంలో వైద్యశాల నిర్వహించాలని సూచించినా.. అద్దెలు ఎక్కువగా ఉండటం, ప్రభుత్వం ఇచ్చే అద్దె తక్కువ కావడంతో భవనాలు ఎవరూ ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి పీహెచ్‌సీకి కేటాయించిన స్థలంలో నూతన భవన నిర్మాణం జరిగేలా చూడాలని, తగినంత సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రైఫిల్ షూటింగ్‌లో పతకాల పంట



తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ విద్యార్థి జూనియర్ ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్ రైఫిల్ షూటింగ్‌లో ఐదు బంగారు పతకాలు, రెండు కాంస్య పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో సీఎస్‌ఐటీ మూడో సంవత్సరం విద్యార్థి నేలవల్లి ముఖేష్ గత నెల 26 నుంచి అక్టోబర్ 7 వరకు పెరు దేశంలోని లిమాలో జరిగిన జూనియర్ ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత దేశం తరుపున ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. మొత్తం ఆరు విభాగాల్లో పది పతకాలకు పోటీపడగా 5 బంగారు పతకాలు సాధించాడని చెప్పారు. ఈ సందర్భంగా ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు విద్యార్థి ముఖేష్‌కు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

20న కుంచనపల్లిలో ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ కుంచనపల్లి హైవే పక్కన గల రామ్ స్నేహ ఎవెన్యూ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 20న ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా రెండవ ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లక్ష్మి కంటి పరీక్ష కేంద్రం వైద్యులు నిఖిల్, కె. శ్రీకర్ వైద్య సేవలను అందజేస్తారని పేర్కొన్నారు. మందులు అందజేస్తారని, ఈ అవకాశాన్ని తాడేపల్లి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల ధర్నా

మంగళగిరి: క్లాప్ ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డ్రైవర్లు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న డ్రైవర్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులందరికి వేతనాలు పెరిగినా డ్రైవర్లకు పెంచకపోవడం బాధాకరమన్నారు. కేవలం నెలకు రూ.12,500 చెల్లిస్తున్నారని అవి కూడా సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ యూనియన్ నాయకులు డి.శివ, రవి, సతీష్, ఆర్ కృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు నిరసనను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : మెల్లెంపూడి సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 2022–23 సంవత్సరానికి వాడిన విద్యుత్ పైన ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.8,114 కోట్లు ప్రజల మీద భారం వేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఇప్పటికే ప్రజలు ఉపాధి లేక వలసల బాట పడుతున్నారని, నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వరదల వల్ల పంటలు దెబ్బతిని, గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందుల్లో పడ్డారని ఇటువంటి సమయంలో విద్యుత్ భారాలు మోపడం సరికాదన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తాడేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మెల్లెంపూడి సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

36 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ: తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన 36 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాయపూడిలో సుబ్బారావు అనే వ్యక్తికి చెందిన రేకుల షెడ్డులో అబ్బరాజుపాలెం గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి రేషన్ బియ్యం నిల్వ చేశాడని వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ బాబురావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నిల్వ ఉంచిన బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

కాల్వలు పారుదల ఉండే విధంగా చూడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంటకాల్వలు, మురుగుకాల్వల్లో పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. 24వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వ్యర్థాలు రోడ్లపై ఉండకుండా చూడాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, మున్సిపల్ శానిటరీ సెక్రటరీలు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మునిసిపల్ డీఈ

తెనాలిఅర్బన్: మున్సిపల్ డీఈగా కె.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాపట్ల మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న నాగభూషణం గుంటూరు కార్పొరేషన్ బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

బీసీజీ వ్యాక్సిన్‌ను వేయించుకోండి

తెనాలిఅర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ కోరారు. 37వ వార్డులోని వార్డు సచివాలయంలో గురువారం నిర్వహించిన వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్‌పై అపోహలు విడాలన్నారు. బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవడం వలన క్షయను నివారించవచ్చని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి


కండ్రికలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే టి. శ్రావణ్‌కుమార్ అన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఫిరంగిపురం, వేములూరిపాడు, కండ్రిక గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎం.నరసింహారావు, ఎస్.రవి ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ సదస్సు జయప్రదానికి పిలుపు


మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : వ్యవసాయరంగ సమస్యలపై అక్టోబర్ 22న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వ్యవసాయ రంగ సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. గురువారం దుగ్గిరాలలో ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్.యోగేశ్వరరావు అధ్యక్షత రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ అక్టోబర్ 22న విజయవాడలో జరుగనున్న వ్యవసాయ సదస్సులో కేరళ రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజుకృష్ణన్, విద్యుత్ రంగ నిపుణులు డాక్టర్ కె.అశోక్ రావు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సులో కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు రుణ విమోచన చట్టం, రైతు అనుకూల విధానాలు, విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం తెస్తున్న సంస్కరణలు, తదితర అంశాలపై చర్చలు కొనసాగుతాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పెట్టుబడి సాయం కింద రైతులకు రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి


తెనాలి డీఎస్పీ జనార్దనరావు


అత్తోటలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

అత్తోట(కొల్లిపర): రోజు రోజుకు నూతన టెక్నాలజీతో ప్రపంచం ముందుకు పోతున్న సమయంలో దానికి అనుగుణంగా వివిధ సైబర్ నేరగాళ్లు కూడా పెరుగుతున్నారు అని ఇటువంటి సమయంలో ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి నేరాలను అరికట్టాలని తెనాలి డీఎస్పీ బి. జనార్ధనరావు సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అత్తోట గ్రామంలో గురువారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెనాలి డీస్పీ బి.జనార్ధనరావు , ట్రైనీ ఎస్పీ ఎం.ఎస్ భార్గవి, సీఐ బెల్లం శ్రీనివాసరావు పాల్గొని డ్వాక్రా మహిళలకు, రైతులకు సైబర్ నేరాలతో పాటు వివిధ నేరాల గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రైనీ ఎస్పీ ఎం.ఎస్ భార్గవి మాట్లాడుతూ మహిళలు బ్యాంకుల వద్ద నుంచి డబ్బులు తీసుకువెళ్లే సమయంలో బ్యాంకు ఆవరణలో ఉన్న అపరిచితులు పదేపదే వారిని చూస్తున్నా , వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, వారు చెప్పే మాయ మాటలు నమ్మకుండా ఉండాలని, ఏమైనా అనుమానం వస్తే వెంటనే అక్కడ ఉన్న బ్యాంకు మేనేజర్ గాని దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో గాని సమాచారం అందించాలని సూచించారు.

సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి మీము బ్యాంకు నుండి, పలానా కంపెనీ నుంచి లేదా మీకు లాటరీ తగిలిందని అని నమ్మపలికి మీ ఖాతాలో రూ.50 వేల నుంచి లక్ష వరకు డబ్బులు వస్తాయి అని నమ్మపలికి , మొత్తం మీ ఖాతాలో డబ్బులు జమ కావాలంటే ముందుగా మీరు మీము చెప్పిన ఖాతాకు నామాత్రం ఫీజు చెల్లించాలని చెప్పి తరువాత మీ దగ్గర నుంచి మీ ఖాతా వివరాలు, ఓటీపీలు తెలుసుకుని మీ ఖాతాల్లో ఉన్న సొమ్ము మొత్తం వారి ఖాతాలో జమ చేసుకోవటం జరుగుతుందని ఇటు సంఘటనలుపై ప్రజలు అవగాహన కలిగి ఉండి ఇటువంటి సైబర్ నేరాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనంతరం పోలీస్ వారు ప్రజలకు సైబర్ నేరాలు ఎన్ని రకాలు, వాటి ద్వారా నేరగాలు ఏ విధంగా మోసాలు చేస్తారు అన్న విషయాలను వీడియోలు ద్వారా ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.కోటేశ్వరరావు , ఎఎస్ఐ పోతురాజు, సిబ్బంది తాతరావు, కూర్మారావు, నాగబాబు, విజయ్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు వద్దే వద్దు


దర్నా నిర్వహిస్తున్న మహిళలు, స్థానికులు

నగరంపాలెం: ఇళ్ల మధ్య ఏర్పాటుచేయనున్న మద్యం దుకాణాలను వెంటనే ఎత్తివేయాలంటూ స్థానికుల పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. త్వరలో వైన్స్ షాప్ ప్రారంభం అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ఆయా దుకాణాల ఎదుట షామియానాలు వేసి నిరసనకు దిగారు. ఈ క్రమంలో యాజమానులతో స్వల్ప వాదన జరిగింది. పాతగుంటూరు మణిహోటల్ సెంటర్‌లో మూడు మద్యం దుకాణాలు ప్రారంభించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. పెద్ద సంఖ్యలో స్థానికులు, మహిళలు పెద్ద ఎత్తున్న చేరుకున్నారు. ఆయా మద్యం దుకాణాల వద్ద షామియానాలు వేసి నిరసనకు దిగారు. జనావాసాల మధ్య మద్యం దుకాణాలు తెరవద్దంటూ నినదించారు. దగ్గర్లో దేవాలయం, మసీదు, చర్చి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. దీంతో నిత్యం రాకపోకలు చేస్తుంటారని అన్నారు. మందుబాబులు తాగి ఇక్కడే చిందులేస్తుంటారని వారు వాపోయారు. కనీసం రాకపోకలు చేయాలన్నా కష్టంగా ఉంటుందని అన్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఇటువైపుగా రాకపోకలు చేస్తుంటారని తెలిపారు. రాత్రిళ్లు మరింత ఇబ్బందిగా ఉంటుందని, రాత్రి ఏడు గంటలకు బయటకు రావాలంటే వణుకు వస్తుందని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. మద్యం దుకాణాలు ఇక్కడే ఏర్పాటు చేస్తే స్థానికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిరసనలో స్థానికులు జంగాల చైతన్య, శంకరరెడ్డి, బ్రహ్మానాయుడు, రావెల వెంకటేశ్వరరావు, పాస్టర్ సీహెచ్ ప్రభుకుమార్, అల్తాఫ్, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు సన్మానం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణం, ఇతర ప్రాంతాల్లోని స్వర్ణకారులు మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను తాడేపల్లిలోని ఆయన నివాసంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు స్వర్ణకారులు మాట్లాడుతూ స్వర్ణకారుల 60 సంవత్సరాల కల మంత్రి లోకేష్ వల్ల తీరిందన్నారు. నియోజకవర్గంలో పాద యాత్ర సందర్భంగా స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అందులో భాగంగా స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటుకు సన్నాహాలు చేశారన్నారు. మంగళగిరిని గోల్డ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి లోకేష్ చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ గోల్డ్ వ్యాపారులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ హితం దీపావళి



తాడేపల్లిరూరల్ : పర్యావరణ హితమైన దీపావళిని ప్రజలందరూ జరుపుకోవాలని కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం నూతక్కి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దీపావళి పండగ రోజు బాణ సంచా ధ్వని, వాయు కాలుష్యంతో పర్యావరణాన్ని కీడు చేయకూడదని పిల్లలకు వివరించారు. ఈ బాధ్యత పెద్దలపై ఉందని చెప్పారు. సీఎస్ఈ హానర్స్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.నవీన్ నాయనన్ మాట్లాడుతూ.. విష వాయువులు, శబ్దం కారణంగా వాతావరణం కలుషితమై శ్వాసకోశ వ్యాధులు, వినికిడి సమస్యలు, కళ్ల మంటలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వలంటీర్లు, సమన్వయ కర్త పి. సురేష్‌ను వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్‌లు డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ అథితన్ అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

పట్నంబజారు: ప్రయాణికులనుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఈ నెల 18వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ డిపో 2 మేనేజర్ షేక్ అబ్దుల్‌సలామ్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం జరుగుతుందని తెలిపారు. గుంటూరు, తెనాలి, విజయవాడ, విశాఖపట్నం రూట్లలో తిరిగే బస్సులకు సంబంధించిన ప్రయాణికులు 99592 25421 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

వేంకటేశ్వరుని హుండీ రాబడి రూ.32.90 లక్షలు



తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం 75 రోజుల కాలపరిమితికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీల లెక్కింపు నిర్వహించారు. పొన్నూరులోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి టి.శ్రీనివాస్ సమక్షంలో హుండీ లెక్కింపు చేశారు. అనంతరం రూ.32,90,502 నగదు, 81.500 గ్రాముల బంగారం, 1,575 గ్రాముల వెండి వచ్చినట్టు వైకుంఠపురం ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ తెలియజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు కనికచర్ల చరణరత్న సందీప్, వంగల జగదీశ్వరి, కురగంటి సునీత –రవిశంకర్, బొద్దులూరి సరస్వతి–నాగేశ్వరరావు, మావులూరి శ్రీనివాస్, ముంతా ప్రసాద్, దేవరకొండ వెంకటరమణ–శంకరరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అకోహరి రవి కుమార్, ఏపీసీవో బ్యాంక్, చెంచుపేట సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


వాల్మీకి చిత్రపటానికి కమిషనర్ ఆలీంబాషా నివాళి


బీసీ సంక్షేమ సంఘం నాయకుల నివాళి

మంగళగిరి: సంస్కృత సాహిత్యంలో ఆది కవి, రామాయణ మహాకావ్యాన్ని లిఖించిన జ్ఞాన నిధి వాల్మీకి మహర్షి అని మున్సిపల్ కమిషనర్ ఆలీం బాషా కొనియాడారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.శకుంతల, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీకాంత్, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

– పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు ఆయన సేవలను కొనియాడారు. సంఘం నాయకులు కేశన శంకరరావు, పారేపల్లి మహేష్, ఉప్పాల రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఇదేం పంచాయితీ

అధికారం అండతో టీడీపీ నేతల అత్యుత్సాహం


దుకాణాల తాళాలు పగలగొట్టిస్తున్న టీడీపీ నాయకులు


తెరిచిన దుకాణాలు

తాడికొండ: అధికారం అండతో టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. తాడికొండలో మరోసారి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలుగా ఆరేళ్లుగా మూతపడిన దుకాణాలు తెరిచారు. గత టీడీపీ హయాంలో అప్పటి సర్పంచ్ పంచాయతీ పేరుతో నాలుగు దుకాణాలకుగాను టీడీపీ నేతల నుంచి రూ.1.50 లక్షల చొప్పున మొత్తం రూ.6 లక్షలు డిపాజిట్ పేరుతో సేకరించారు. ఆ నగదును పంచాయతీ ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకొని, దుకాణాలను నిర్మించాడు. ఈ నిర్మాణాలకు ఎలాంటి సాంకేతిక అనుమతులు లేవు. తన అనునాయులకు కట్టబెట్టేందుకు యత్నించడంతో అప్పటి అధికారులు అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసిన తరువాత, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సాంకేతిక అనుమతులు మంజూరు చేసి, ఎస్టిమేషన్ వేయించి టెండరు ద్వారా లేదా ఇతర డ్వాక్రా సంఘాల ద్వారా నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తారు. కానీ ఇక్కడ అదేం జరగలేదు. నగదు తీసుకున్న వారికి పదేళ్ల పాటు వేలం లేకుండా దుకాణాలు అద్దె ప్రాతిపదికన అప్పగించాలంటూ అనధికారికంగా పంచాయతీ తీర్మానం చేసి, అప్పగించే యత్నం జరిగింది. ఈ విధానం తప్పని తెలిసిన అధికారులు అప్పట్లో దుకాణాలను మూసివేసి సీల్ వేశారు. దీనిపై వారు కోర్టును ఆశ్రయించగా ఇటీవల కోర్టు దుకాణాలను వారికి అప్పగించాలని తీర్పునిచ్చింది. అయితే డిపాజిట్లు రూపంలో సేకరించిన సొమ్మును మాత్రం పంచాయతీ ఖాతాలో జమచేయాలంటూ సూచించిన నేపథ్యంలో డిపాజిట్ నగదు వ్యవహారం తేల్చకుండా, పంచాయతీ తీర్మానం చేసి నిర్ణయం తీసుకోకుండా గురువారం హడావుడిగా టీడీపీ నాయకులు దగ్గరుండి మరీ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి తాళాలు పగలగొట్టించారు. దీనిపై పంచాయతీ సర్పంచ్ తోకల సరోజినీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ దృష్టికి తీసుకురాకుండా ఇలాంటి చర్యలకు పాల్పడటం మంచిది కాదన్నారు. పంచాయతీ పాలకవర్గం నిర్ణయం తీసుకునే వరకు వేచిచూడకుండా తాళాలు పగలగొట్టడంపై మండిపడ్డారు. కార్యదర్శి సంజాయిషీ ఇచ్చుకున్నట్లు సమాచారం. పంచాయతీ కార్యదర్శి హరిబాబు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సబ్సిడీ సరుకుల విక్రయ కేంద్రాల తనిఖీ



తెనాలిరూరల్: రైతు బజార్లలో సబ్సిడీ ధరలకు కందిపప్పు, నూనె విక్రయిస్తున్న స్టాల్స్‌ను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గురువారం తనిఖీ చేశారు. పాత రత్నాటాకీస్ సమీపంలోని గాంధీ ఇర్విన్ పార్క్ రైతు బజార్‌లో విక్రయాలకు సంబంధించి స్టాల్స్ వద్ద సరుకుల వివరాల ప్రదర్శన, ధరలను తనిఖీ చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు, తక్కువ ధరలకు సరుకుల విక్రయాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. సీఎస్ డీటీ మూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ మురళి ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com